మృగశిరకార్తె ముసురు పట్టింది.

సన్నగా గాలి వీస్తోంది.

ఇమ్లిబన్ బస్టాండ్‌లో జనం కిటకిటలాడుతున్నారు.

అప్పుడే యాదగిరిగుట్ట నుండి వచ్చిన బస్సులోంచి పోచయ్య దిగాడు. ఆసుపత్రిలో ఉన్న కూతురు యాదమ్మ కళ్ళలో తిరిగింది. పిచ్చిపిల్ల ఎంత బాధ పడ్తుందో ఏమో? తొరగా ఆసుపత్రికి చేరుకోవాలి అనుకొని జనాన్ని తోసుకుంటూ బస్టాండ్ నుండి బయటపడ్డాడు.

కాయకష్టం చేసిన శరీరమైనా కొంచెం చలిగానే ఉంది పోచయ్యకు. కండువా తీసి తలకు చుట్టుకున్నాడు. రోడ్డుపక్క వారగా వున్న టీ బంకులోకెళ్ళి వేడివేడిగా ఒక టీ తాగాడు. ప్రాణం కొంచెం లేచి వచ్చినట్లయింది పోచయ్యకు.

టీ డబ్బులివ్వటానికి జేబులో చెయ్యి పెట్టాడు. అంతే. ముచ్చెమటలు పట్టాయి పోచయ్యకు. జేబు చిరిగి ఉంది. డబ్బుల్లేవు. ఆసుపత్రిలోనున్న కూతురు జ్ఞాపకమొచ్చింది. దుఃఖం ఆపుకోలేక లబోదిబోమన్నాడు.

పోచయ్య గోడును ఎవరు పట్టించుకునేటట్లు లేరు. జనం ఎవరి దారిన వాళ్ళు పోతున్నారు.

టీ బంకువాడికి ఇలాంటి సంఘటనలు సహజంగా జరుగుతాయని తెల్సు. అందుకే పోచయ్యను డబ్బు లడగకుండా తన పని తాను చేసుకుపోతున్నాడు.

పోచయ్య కేకలేస్తూ మరీ ఏడుస్తున్నాడు. వెర్రిగా దిక్కులు చూస్తున్నాడు. గుండెలు బాదుకుంటున్నాడు.

ఈ జనారణ్యంలో పోచయ్య రోదన వినే నాథుడే లేడు.

సరిగ్గా అప్పుడే డ్యూటీ దిగి అటుగా వస్తున్న పోలీసు కానిస్టేబుల్ పర్వతాలు పోచయ్య ఏడ్పులు విని టక్కున సైకిల్ ఆపి ''ఏమైంది? ఎందుకేడుస్తున్నావ్?'' అడిగాడు.

''నా జేబు ఎవరో కొట్టేసిన్రు దొరా'' ఏడుస్తూనే చెప్పాడు పోచయ్య.

''ఏ వూర్నెల్ల వస్తున్నవ్?''

''బోనగిరి కెల్లి వస్తున్న దొర''

''ఎన్ని డబ్బులు పోయినయి''

''ఎయ్యి రూపాయల్దొర''

''అంత డబ్బు దీస్కొని వచ్చినోనివి హుషార్‌గా వుండవద్దే. పట్నంల దొంగ నాయాళ్ళుంటరని తెల్వదు?''

''నాకేటి తెల్సు దొర? నా బిడ్డ కాన్పుకు ఆసుపత్రికి తెచ్చిన. డాక్టర్ ఆపరేసన్ చేయాలన్నడు. తిర్గి ఊరికెల్లి, మా ఆడదాని చెవిపోగులు తాకట్టు పెట్టి తెచ్చిన డబ్బులు దొర అయి - ఇప్పుడు నా బిడ్డ గతేం కాను దేవుడా?'' అంటూ మళ్ళీ ఏడ్పు లంకించుకున్నాడు.

''అరె ముందుగా ఏడ్పు ఆపు'' గదమాయించాడు పోలీసు పర్వతాలు.

''సరె దొర'' బలవంతంగా ఏడ్పు ఆపి కళ్ళు తుడ్చుకున్నాడు పోచయ్య.

''నువ్వేడ్వకు. అర్థమయిందా?''

తల ఊపాడు పోచయ్య.

''నేను బస్టాండ్‌ల చూసి వస్తా. నువ్వే గీణ్ణే గీ హోటల్ల కూసో...'' అన్చెప్పి సైకిల్‌స్టాండ్ వేసి ''లమ్డీ కొడుకులు దొరకాలే కాని - ఏ కీలుకాకీలు ఇర్చేస్తా'' అంటూ బస్టాండ్ వైపు వెళ్ళాడు పర్వతాలు.

పోచయ్యకు కొంచెం ధైర్యం వచ్చింది. పోలీసులంటే తనక్కూడా మంచి అభిప్రాయం లేదు. కాని పర్వతాలును చూశాక తన అభిప్రాయం తప్పు అనుకుని పర్వతాలు వెళ్ళిన దిక్కుగా చూస్తూ కూర్చున్నాడు పోచయ్య.

పోలీసు పర్వతాలు బస్టాండ్ లోపలికెళ్ళాడు.

పోచయ్య యాద్గిరి నర్సింహ్మస్వామికి మొక్కున్నాడు. దొంగ దొరికి డబ్బుల్దొరికితే గుట్టకొస్తానని.

వెళ్ళిన కొద్దిసేపటికి తిరిగొచ్చాడు పోలీసు పర్వతాలు.

అతని రాక కోసమే ఎదురుచూస్తున్న పోచయ్య ''ఏమైంది? దొంగ దొరికాడా దొర'' ఆత్రంగా అడిగాడు.

''బస్టాండు మొత్తం తిరిగిన. నాయాళ్ళెక్కడా కన్పించలేదు. ఏ కల్లు కాంపౌండ్ కెళ్ళారో ఏ దొమ్మరి గుడిసెల్లో దూరారో - నీ టైం బాగలేదు మరి'' అన్నాడు డీలాపడిపోయి.


పోచయ్యకు మళ్ళీ దుఃఖం తన్నుకొచ్చింది.

''ఇగో నీ అడ్రస్ చెప్పి ఎళ్ళు - కొడుకులు ఎప్పుడు దొరికినా - చెవులు పిండి డబ్బులు వాపస్ ఇప్పిస్తా'' అన్నాడు పోలీసు పర్వతాలు.

''సరె దొర'' అని పోచయ్య అడ్రస్ ఇచ్చాడు.

''మరి ఇప్పుడు ఎట్లా ఎళ్తావ్? ఇగో ఈ పది రూపాయలుంచుకో'' అని ఓ పదిరూపాయల నోటు పోచయ్య చేతిలో పెట్టాడు పర్వతాలు.

సందేహిస్తూనే పది రూపాయలు తీసుకొని - ''తిరిగి



# రంగు వెలిసిన రాత్రి

— టి.కె. ఊర్మిళ

మీ రుణం ఎట్లా తీర్చుకోను దొర'' అన్నాడు. ఇస్వంటోళ్ళు ఉండబట్టే ఈ కాలం ఇంతైనా బాగుంది అనుకున్నాడు పోచయ్య.

''నేను ఎళ్తున్నా బద్రంగా ఎళ్ళు'' అంటూ సైకిల్ ఎక్కి వెళ్ళిపోయాడు పోలీసు పర్వతాలు.

పోచయ్యకు తిరిగి కూతురు కళ్ళలో మెదిలింది. ఆసుపత్రి వైపు నడక మొదలెట్టాడు. వచ్చే దుఃఖాన్ని ఆపుకునే ప్రయత్నం చేస్తూ.

★ ★ ★

అలా సైకిల్ తొక్కుకుంటూ వెళ్తున్న పోలీసు పర్వతాలుకు గాలిగూడ దాటిన కొద్ది దూరంలో రోడ్డు పక్కన మిలట్రీ హోటల్ కన్పించింది. ఆ వెంటనే మసాల వాసన నసాళానికి సోకింది. తిన్నగా సైకిల్ హోటల్‌కాడికి పోనిచ్చి దిగి స్టాండ్ వేసి హుషారుగా లోపలికెళ్ళి ఓ ఖాళీ టేబిల్ దగ్గర కూర్చున్నాడు. హోటల్‌లో నాలుగు మూలలా పరికించి చూశాడు. తనను గుర్తుపట్టే వాళ్ళెవరూ లేరని నిర్ధారించుకొని జేబులో చెయ్యి పెట్టి వంద రూపాయి నోట్లు బయటికి తీసి లెక్కపెట్టాడు. తొమ్మిదొందలున్నాయి. దొంగ నాయాల వంద తింటే తిన్నాడు కాని, సర్గిగా వేళకు దొరికాడు. పొద్దున్నే ఎవరి ముఖం చూచానో అని ఆలోచించటం మొదలెట్టాడు. మరుసటి రోజు కూడా అదే ముఖం చూడాలని నిర్ణయించుకున్నాడు. పాపం! పల్లెటూరి రైతు - దొంగ దొరకలేదంటే నమ్మి వెళ్ళిపోయాడు. ఒక వైపు దొంగ నుండి సొమ్మును రాబట్టినందుకు, మరోవైపు సొమ్ము దొరకలేదని పల్లెటూరి వాడిని నమ్మించినందుకు గర్వంగా ఉంది పర్వతాలుకు. ఈ సంతోషంలో మందు తాగాల్సిందేనని నిర్ణయాని కొచ్చాడు. ఇలా ఆలోచిస్తూనే బేరర్‌ను పిలిచాడు.

''క్యా సాబ్?'' అంటూ బేరర్ వచ్చాడు.

''ఆఫ్ బాటిల్ బ్రాందీ తీస్కురాపో'' బేరర్‌కు పురమాయించాడు.

''మా సేర్‌కు చెప్పండి సార్'' అన్నాడు వాడు.

ఆ మాటతో కోపమొచ్చింది పర్వతాలుకు.

''ఎక్కడ్రా మీ సేర్? పిలు'' అన్నాడు కఠినంగా-

''వద్దు లేండి. డబ్బులివ్వండి తెస్తాను'' అన్నాడు బేరర్.

వాడివైపు కొరకొరా చూస్తూనే జేబులోంచి వంద రూపాయల నోటు తీసి ఇస్తూ ''అర్జెంటుగా రావాలి'' అన్నాడు.

పోలీసులతో ఇదే తంటా అనేట్లు ఒక చూపు వేసి బయటి కెళ్ళిపోయాడు బేరర్.

బయట ముసురు పెరిగింది. లోపల్నించి చలి తన్నుతుంది పర్వతాలుకు. మనసు ఉల్లాసంగా తనకు సెల్యూట్ కొడ్తున్నట్లు ఫీలయ్యాడు పర్వతాలు.

> ''నా బిడ్డకు నూరేళ్ళు నిండాయి దేవుడో...'' అంటూ గుండెలవిసేలా రోదిస్తోంది. ఆమెను వెంటనే పోల్చుకోలేక పోయాడు పర్వతాలు. కొంచెం కొంచెంగా ఆమె ఎవరో జ్ఞాపకం వచ్చేవరకు మత్తు సగం దిగిపోయింది

బాటిల్, గ్లాసు తెచ్చిపెట్టాడు బేరర్.

ఇక ఆగలేను అన్నట్లు బాటిల్ ఓపెన్ చేసి ఓ పెగ్గు గ్లాసులో పోసుకొని గటుక్కున మింగేశాడు పర్వతాలు. గొంతు కొంచెం మంటగా వుంటే కాసిన్ని నీళ్ళు తాగాడు.

''ఏమన్నా తీసుకుంటారా సార్'' అడిగాడు బేరర్.

''కల్మీకబాబ్ ఉందా?'' అడిగాడు పర్వతాలు. ఎస్.పి ఫేర్‌వెల్ పార్టీలో కొడుకులందరూ కోళ్ళకు కోళ్ళు పీక్కుతిని వట్టి బొక్కలే ఉంచారు. కసిగా అనుకున్నాడు.

''ఉన్నాయి సార్... కాని పది నిముషాలు టైం తీసుకుంటది'' అన్నాడు బేరర్ ముందే చెప్పటం మంచిదనే ఉద్దేశంతో.

''పది నిమిషాలు కాదు - అర్ధగంటకు తీస్కురా. కాని మంచిగా కాల్చమని చెప్పు. లేకుంటే తెల్సు కదా?''

''తెల్సు సార్! ఎన్ని తెమ్మంటార్ సార్?''

''నాలుగు పట్కురా'' అన్చెప్పి రెండో పెగ్గు పోసుకోవటంలో లీనమయ్యాడు పర్వతాలు.

బిల్లు తెలిసే నాలుగు తెమ్మంటున్నాడా? బిల్లు ముందే చెప్పాలా? వద్దా? చెప్తే ఏం తంటో? చెప్పకుండా ఉంటే ఏం తంటో? ఆలోచిస్తూ వుండిపోయాడు బేరర్.

మందు పోస్కుని సప్పరించి, బేరర్ వైపు చూసి ''అరె! ఇంకా ఇక్కడే ఉన్నావా?'' అన్నాడు పర్వతాలు గుడ్లురిమి చూస్తూ.

వాడు భయంతో అదిరిపడి ''పోతున్న సార్'' అంటూ పరుగులాంటి నడకతో వంట మాస్టర్ దగ్గరకెళ్ళాడు.

అలా సాయంత్రం ఏడింటికి మొదలైన పోలీసు పర్వతాలు ఒన్‌మాన్ పార్టీ పూర్తయ్యేసరికి రాత్రి పది గంటలకు ముగిసింది.

కొంచెం మాటలు, అడుగులు తడబడ్తున్నాయి. అయినా పోలీసు ఠీవితో నడుచుకుంటూ వెళ్ళి బిల్ ఇచ్చేసి బయటపడ్డాడు.

సైకిలెక్కి తూలుకుంటూనే, ఇంటి దారి పట్టాడు. ఎదురొచ్చిన ఆటో వాళ్ళను, రిక్షా వాళ్ళను బూతులు తిట్టుకుంటూ ఇంటికి చేరాడు. ఇంట్లో, బయట లైట్లు వెలుగుతున్నాయ్. ఇంటి నిండా జనం నిండి ఉన్నారు. పర్వతాలుకు ఏదో అనుమానం, భయంతో కొంత మత్తు వదిలినట్లయింది - సైకిల్ దిగి స్టాండ్ వేశాడు. అంతే... నలభై సంవత్సరాల వయసున్న ఒకావిడ పరిగెత్తుకుంటూ వచ్చి, గట్టిగా వాటేసుకుని - ''నా బిడ్డకు నూరేళ్ళు నిండాయి దేవుడో...'' అంటూ గుండెలవిసేలా రోదిస్తోంది. ఆమెను వెంటనే పోల్చుకోలేక పోయాడు పర్వతాలు. కొంచెం కొంచెంగా ఆమె ఎవరో జ్ఞాపకం వచ్చేవరకు మత్తు సగం దిగిపోయింది పర్వతాలుకు - ఆమె తన చిన్నత్త. అంటే తన భార్య పిన్ని ఎందుకేడుస్తున్నట్లు - తన భార్య కేమయినా అయిందా? అని ఆలోచిస్తున్న లోగా పర్వతాలు భార్య వచ్చి - ''పిన్ని కూతుర్ని ప్రసవానికి తెచ్చారు. ఇక్కడే ఆసుపత్రిలో ప్రసవం కష్టమై తల్లీ బిడ్డ ఇద్దరూ చనిపోయారండి...'' అంటూ తనూ ముక్కు చీదుతూ ఏడుస్తూ చెప్పింది. పర్వతాలు మ్రాన్పడిపోయాడు. సరిగ్గా పది సంవత్సరాల క్రితం తను పోలీసు ఉద్యోగంలో సెలక్ట్ అయ్యాడు - కాని పదివేలు లేనిదే ఆర్డరిచ్చేట్టు లేరు. తమది పేద కుటుంబం. ఎక్కడా అంత డబ్బు అప్పు పుట్టేటట్లు లేదు. అప్పటికే తనకు పెళ్ళయింది. అత్తగారింట్లో అడిగి చూద్దామని వెళ్ళాడు. వాళ్ళ పరిస్థితి కూడా దినకూళ్ళ మీద ఆధారపడిందే. ఈ అవకాశం మళ్ళీ రాదు ఎలాగని ఆలోచిస్తున్న తనకు చుట్టపు చూపుగా వచ్చిన చిన్నత్త ఈ విషయం తెల్సుకొని తన మెడలోని మూడు తులాల బంగారు గొలుసు తనకిచ్చింది. ఉద్యోగం దొరికాక చేయించి ఇవ్వమని. నేను మొహమాటపడ్తాంటే - ''కొడుకు లాంటి వాడివి. నా కొడుకైతే ఇవ్వనా. అయినా ఊరికే ఇస్తున్నానా? ఉద్యోగం దొరికాక తీసుకుంటాగా. తీసుకో బాబు'' అంటూ. ఇలా ఆలోచిస్తున్న తనను ఇంకా కుదుపుతూ రోదిస్తున్న ఆమె రోదన పర్వతాలును ఆలోచించనివ్వట్లేదు. కొద్దిగా సంభాళించుకొని శవం వున్న వైపు చూపు సారించాడు. శవంపైన పడి బోరున విలపిస్తున్న పల్లెటూరి ఆసామిని చూసి నిశ్చేష్టుడయ్యాడు. అతను బస్టాండ్‌లో డబ్బులు పోగొట్టుకున్న పోచయ్య. ఎంత దారుణం జరిగింది. నన్ను - నా కుటుంబాన్ని ఆదుకొని సంఘంలో నన్నొక బాధ్యతగల ఉద్యోగిగా చేసిన వాళ్ళకా నేను ద్రోహం చేసింది - పర్వతాలుకు తాగిన మత్తు పూర్తిగా దిగింది. కాని పశ్చాత్తాపంతో కాళ్ళు వణుకుతున్నాయ్. నేలమీద నిలబడ లేకపోతున్నాడు. ఈ ద్రోహపు గుణం తన రక్తంలో ఉందా? ఖాకీగుడ్డల ద్వారా తిన్న ఉప్పులో నుండి వచ్చిందా? పర్వతాలుకు అర్థం కావటంలేదు.

వర్షం పెద్దదయింది. పెద్దపెద్ద చినుకులు టపటప పడ్తున్నాయి.

''వర్షం పెరిగింది. ఇంట్లోకి పదండి'' అంది పర్వతాలు భార్య ముక్కు చీదుకుంటూ.

కాని పర్వతాలు కదల్లేదు. వర్షం నుండి పడ్తున్న ప్రతి చినుకు అక్కడున్న జనం తుప్పు తప్పున తన మీద ఊస్తున్నట్లు. ఆ ఉమ్మిలో తను తడిసి ముద్దయినట్లు...

★